కథానిక: ★ వెన్నెల వాన ★

"కాదు... కాదు.... కానేకాదు..."

"ఔను... ఔను... ఔనౌను..."

అది సరోజ: ఇది శేషగిరి

చంద్రుడు ఎటు ఉదయిస్తాడన్నది సమస్య.

"కాదండీ బాబూ... కాదు... నా మాట నమ్మండీ" అంది సరోజ.

"ఇదుగో అమ్మాయ్... నేను బియ్యే జాగ్రఫీని... ఈ చంద్రుడు వగైరాలను బాగా ఎరిగిన వాడిని..." అనబోయాడు శేషగిరి.

"అయితేనేం?" తీవిగా ఎదిరించింది వాళ్ళావిడ.

"అంచేతా... నే చెబితే విను... సూర్యుడు తూర్పున ఉదయించి పడమట అస్తమించును. తెలిసిందా? మరి, చంద్రుడేమో- యట్-రైట్ అంగిల్స్ ప్రయాణించును, యనగా ఉత్తరాన ఉదయించి దక్షిణాన యస్తమించును."

"మీ జాగర్ఫీ..."

"ఊ?"

"వేరుశెనక్కాయ బర్ఫీలా వుంది!"

"వెనకెవడో అన్నాట్ట- వేరుశెనక్కాయ బర్ఫీ విషయం సరోజినమ్మకేం తెలుసూ- అని"

"ఓహో!"

"చంద్రుడిలాంటి అందాల మొహంగల అమ్మాయికి చంద్రుడి విషయం తెలియక పోవడం ఏమిటీ- అని కూడా అన్నాట్ట!"

"అయ్యో శేషగిరిరావుగారూ!... చంద్రవదన అని పిలిపించుకోవాలని నాకు బొత్తిగా లేదు... కనుక, తమరు నన్ను పొగిడేసినంత మాత్రాన చంద్రుడు ఉత్తర దిశను ఉదయిస్తాడంటే ఒప్పుకోను..."

"మరేం చేస్తే ఒప్పుకుంటారటా? అని వంగి ఆమె గడ్డంకింద మొహంపెట్టి కళ్ళల్లోకి చూశాడు శేషగిరి.

ఇంకాస్సేపయితే ఓడిపోక తప్పదు;- అని తెలిసిన సరోజ మొహాన్ని పక్కకు తిప్పుకుంది- "ఏం చేసినా ఒప్పుకోను... ఆ!" అని నొక్కి పలికింది.

శేషగిరి చటుక్కున దూరంగా జరిగాడు. మూడు గజాల దూరాన, గోడమీద ఓకాలా నించి నిల్చున్నాడు. చీపురుపుల్ల నములుతూ, దీక్షగా చూస్తూ సంబోధించాడు. "సరోజా!... సరోజినీ....! సరోజినీదేవీ-!!"

"ఇంక లాభం లేదల్లే వుంది; ఈ పూట ఈయనకు లొంగిపోవలసిందేనా-" అంతరంగంలోని ఆలోచనను నొక్కిపెట్టి గంభీరంగా నిల్చుని వున్న తన "అబ్బాయి"ని చూసింది. మురిసిపోతున్న సరోజకు శేషగిరి సీరియస్‌గా వేసిన ప్రశ్న వినపడింది.

"ఏయ్ పిల్లా! నువ్వు భారత సతివి కావూ?"

"స్వామీ!... ఎలక్షన్ వాడిలా ప్లేటు మార్చేయకండి! అంత దుగ్ధగావుంటే మీ ప్రశ్నకు జవాబు వినండి... నేను భారత సతిని కాదు- సరేనా?" అని స్పష్టంగా చెప్పింది సరోజ.

దిగులుపడిపోయి దీనంగా అడిగాడు శేషగిరి- "ఆఁ!" ఆఁ!!... నువ్వు భారత సతివి

## రచన:

## వాకాటి పాండురంగారావ్

కావూ- నువ్వు భారత సతివి కావూ? కావూ?!"
చిరునవ్వు దోబూచులాడే పెదవులమధ్య నుండి జవాబు వెలిగింది. "నేను భారత సతిని కాదండీ!- శేషగిరి సతిని!!"

చిరునవ్వు నవ్వయింది; నవ్వు బహువచనమయింది.

మళ్ళీ మొదలెట్టాడు శేషగిరి "అంచేతా, చంద్రుడూ, కుబేరుడి దిశలో..."

పెదవులు బిగించి తలనడ్డంగా తిప్పింది సరోజా. "నహి - నహి -"

"ఇహి... నహి... కహి-" అని వెక్కిరించాడు శేషగిరి.

కుర్చీలో చేరగిలబడి నవ్వింది సరోజ.

అప్పుడే మేడమీదనుంచి ఫుల్‌సూటులో దిగాడు శేషగిరి అన్నయ్య విశ్వనాథం.

"ఎందుకమ్మా మరదలూ, ఆదివారం సంజ వేళ ఈ సంగీతం?" చటుక్కున నవ్వాపి లేచి నిల్చుంది సరోజ.

"కూచోవమ్మా కూచో!" అని తమ్ముడిని పలకరించాడు- "ఏవిట్రా కథా?"

"అబ్బే, ఏమీ లేదురా- ఈ మొద్దు పిల్లకూ చంద్రుడెటు ఉదయిస్తాడో కూడా తెలియడం లేదు... శాస్త్ర జాగ్రఫీ చెబుదామని ప్రయత్నిస్తే, అపహాసంగా- నువ్వేదో తన నవ్వు జలతరంగం మీద శంకరాభరణమన్నావు కదా అని- గలగల్లాడేస్తుంది... బొత్తిగా సీరియస్‌నెస్ లేదు. మరీ యంగర్ జనరేషన్!!" అని విసుక్కున్నాడు తమ్ముడు.

కొరకొర చూసిన సరోజ చూపుల సరిగమలు శేషగిరిలో మధురిమలు పలికాయి

"ఇంతకూ చంద్రుడెటువైపుదయిస్తాడనీ?" అన్నాడు విశ్వనాథం మరదలి కేసి చూసి.

"అది కాదు బావా, తనంటారూ సూర్యుడు తూర్పునా- చంద్రుడేమో-"

"నా పరువుని ఉడికిన బంగాళాదుంప తొక్కలా తీసేయకునీ-" అన్నట్లు చూశాడు శేషగిరి; కాని ఆ కాస్త పనీ చేసి కూచుంది సరోజ.

"తనేమో చంద్రుడట్టా, ఉత్తరాన ఉదయిస్తాడంటారు బావా!!"

"పోయిందేనమ్మా!!" అని బుర్రగోక్కున్నాడు విశ్వనాథం.

"పోండి, మీరూ ఆయనతో చేరారూ-" అని బావని రెండో ముద్దాయిగా చేసింది సరోజ.

"నా కన్న అరగంట ముందుదిగి- సిగ్నల్ ముందు రైలుబండిలా ఇక్కడాగిపోయారేం-" అని బాణం విసరుతూ పట్టు చీరతో విసవిసా దిగింది శ్రీమతి సీతా విశ్వనాథం.

ఆ బాణాన్నందుకుని అటు తిరిగాడు విశ్వనాథం "ఇదుగో, సీతా! మనం ఒంటరిగావున్నప్పుడు ఎలా వున్నా ఫరవాలేదు కానీ ఈ కుర్రకారు ఎదుటా, నువ్వు నన్నిలా విదిలించేస్తూ, విమర్శించేస్తూ, వి...వి..."

"అక్కడికేదో ఏకాంతంలో నా పాద సంవాహనం చేసి ట్లూ!!" అని పెదవి వంకర చేసింది సీతాసతి.

నవ్వుని క్రింది పెదవిని నొక్కిపెట్టి నేలమీఁకి చూసింది సరోజ పువ్వుల్లాటి ఆమె పాదాఁమీద ప్రసరించింది శేషగిరి దృష్టి. క్రీగంటితో ఇది గమనించిన సరోజ, చీరెతో పాదాల్ని కప్పుకోవడానికి వృథాగా ప్రయత్నించింది. సీతా, పతీ- ఈ అంతర్నాటకానికి ముసి ముసిగా హాసించారు.

సీత పలికింది- "అయితే చెల్లెమ్మా.... చెంపల్లో అంతోటి కెంపులెందుకనీ? ఎప్పుడయినా మా మరిదిగారి అరచేతుల అరిగిందా నీ అరవింద పాదం!"

మెడ నింకా దించి సీత మరిమి చూసింది సరోజ. అమాంతంగా సరోజను నాలుగు చేతులతో ఆకాశానికి విసిరేసి, మళ్ళీ పట్టుకోవాలనిపించింది శేషగిరికి. హుం! అన్నయ్య వాళ్ళున్నారు... బుద్ధిమంతుడిలా వెళ్ళి సరోజ కూర్చున్న కుర్చీ చేతిమీద. కూర్చున్నట్టు నిల్చున్నాడు.

తలెత్తినసరోజ కంటికి హఠాత్తుగా కనిపించాయి సీత పెదవులు. తక్షణమే ఎదురు దెబ్బ తీసింది. "అక్కయ్యగారూ! మీ పైపెదవి మీదనూ- మరీ ఆ నల్లి గీతలేమిటో?"

తలవంచుకోవడం సీత వంతయింది. మూగదయిన భార్య తరఫున విశ్వనాధం చెప్పబోయాడు" "నిన్న రాత్రేమో- మీ అక్కయ్య పెదవులకు- తలుపు తగిలిందిటమ్మా- అంతేనా"

నమస్కారం పెడతానన్నది సీత కళ్ళతో; నవ్వుతూ ఆగిపోయాడు భర్త.

'బహుశ, ఆ తలుపు బావగారయి వుంటారు!' సరోజ విడుపుకు అన్నాతమ్ముళ్లు మెుల్లమన్నారు.

"ఛీ... ఏం మనుషులండీ బొత్తిగా సిగ్గు లేదు-" అని నసిగింది సీత.

'ఇంతకూ చంద్రుడెటునుంచి వస్తాడంటావూ?' అని సీత నడిగాడు సీతాపతి.

"నేను చెప్పను" అంది బుంగమూతి సీత.

"ఎందుకనో?"

"చెప్పను- అంటే, చె-ప్ప-ను" బుంగమూతి బుంగన్నర మూతిన్నరయింది

"పోనీ నా చెవిలో చెప్పు" అని ఆమె పెదవుల దగ్గర చెవి నానించాడు విశ్వనాధం; "ఛీ... ఛీ... ఛీ..." అని మెడ వెనక్కు తిప్పింది సీత.

సరిగ్గా ఆ క్షణాన్నే సరోజ కుడిభుజంమీద నాజూకయిన నఖక్షతం ఏర్పడింది.

"బాబోయ్!!" అరిచింది సరోజ.

"ఏం జరిగిందీ?" అడిగాడు విశ్వనాధం.

"చంద్రుడు ఉత్తరానే ఉదయిస్తాడని ఒప్పుకోమని గిల్లుతున్నారీయన..."

"అపవాదు.... అపవాదు..." శేషగిరి ఘోష.

ఇంతవరకూ ఈచంద్రుడి కథాకమామీషూ వినని సీత తుళ్ళిపడింది! "హాయిషీ! చంద్రుడూ ఉదయించేదీ- ఉత్తరానషే!" అని దీర్ఘాలతో అడిగింది.

"కాకపోతే?" అని ప్రతిపక్షం చేశాడు విశ్వనాధం.

"మీ మొహం-" అంది సీత.

"చంద్రుడిలా వుండదు-" అని పూర్తిచేశాడు విశ్వనాధం.

"అది కాదండీ. ఎరక్క అడుగుతున్నాను కానీ చంద్రుడు ఉత్తరాన ఉదయించడమేవిటీ?'

"అదేనోయ్ వాళ్ళిద్దరి సమస్యకూడానూ"

"అది సరే కాని సరోజా, అలాగని ఎవడు చెప్పాడూ-" అంది సీత- ఆ చెప్పిన వారెవరో కనబడితే నాలుగు వడ్డిస్తానన్న ధోరణిలో-

"వీరే!" అని చూపుడు వేలికి పని చెప్పింది సరోజ. ఆ వేలి చివరనున్న శేషగిరి- "నీ వేలు అందముయిందని నేను ఏనాడో ఒప్పేసుకున్నానుగా- ఇహ తీసెయ్" అన్నాడు.

"మీరు ఒప్పుకోకపోయినా నా వేలికేం పరవాలేదుగాని. అక్కయ్యకు చెప్పండి ఆ ఆ చంద్రుడి విషయం-"

"ఏం మహాత్మా! నువ్వేనా అలా చెప్పింది... అమిత ప్రచండమయిన మేధస్సయ్యా నీది!! అందుకనే బియ్యేలో నాల్గేళ్ళుంచుకుని పంపారు" అంది సీత.

"అయిందీ అయ్యగారి పనీ!" అని నవ్వుకోబోయిన సరోజ కదనెవరో లాగారు; "నా బియ్యేకేం ఫరవాలేదమ్మా ఒదినాజీ, తమ శ్రీవారు ఎస్సెల్సీ గుమ్మంలో ఎన్నేళ్ళు కాపలా కాచారో అడగండీ-"

"ఏమరోయ్, మరీ విషాద గాధల్లోకి వెళ్ళిపోకండి; ఆ చంద్రుడి విషయమేమిటో గమ్మున తేల్చెయ్యండి-" అని సూచించాడు విశ్వనాధం-

"అంతే కాదక్కయ్యా! బావగారుకూడా ఈయనతో కలిసీ- చంద్రుడుదయించేదీ. ఉత్తరానేనని నన్ను దబాయించేస్తున్నారు-" అని ఫిర్యాదు చేసుకుంది సరోజ.

"...మా చిట్టి తల్లే! మా బంగారు నాయనే! చొచ్చొచ్చో..." అని ప్రేమ కార్చాడు శేషగిరి.

తాను తప్ప అందరూ నవ్వేసరికి సరోజకు శేషగిరి ముక్కు కొరికేద్దామన్నంత కోపం వచ్చింది; వెంటనే "అమ్మో! ఇంచక్కటి ముక్కును కొరికి పాడుచేసుకోవడమే?" నవికూడా అప్పించింది.

"సీత, వకాలతు తీసుకుంది! ఏవండీ! మీరెంత ఎమ్మే అయితే మాత్రం- దొరికింది కదా అని అమ్మాయినలా బెదరగొట్టేస్తారేం?" విశ్వనాధం జవాబిచ్చాడు!" అసలు ప్రశ్నను అడుక్కి వెయ్యొద్దని మళ్ళీ సభవారికి మనవి చేసుకుంటున్నాను."

తన పవిటనులాగి సర్దుకుని అందరినీ చూచింది సీత. విశ్వాన్ని అడిగింది.

"అయితే మరి చెప్పండి! మీరు మీ తమ్ముడితో కలిసి, చంద్రుడు ఉత్తరదిశను ఉదయిస్తాడని అన్నారా!- అన్నారా, లేదా?"

"అన్నాను-" అన్నాడు విశ్వం బోనులో నిల్చున్న వాడిలా.

"ఎందుకు?"

"ఏవిటి ఎందుకు?"

"అదే, అలా ఎందుకన్నారూ- అని?"

"మరి చెప్పమంటావా" అని ప్రాధేయపడ్డాడు విశ్వం.

"చెప్పండి!"

"సరే చెబుతున్నా - మధ్యలో నన్నాపకూడదు సుమా... రెండేళ్ళ వెనక ఒక వెల్లవారుఝామున, తుంగభద్ర ఒడ్డున, సుంకేశుల బంగళాలో- కిటికీ ప్రక్కన మంచంపైన, మల్లెపూవులాటి పరుపుమీద- దానిమ్మ పండులాటి అబ్బాయి, మగత నిద్రలో పక్కకు తిరిగితే-"

"ఛీ! అలాటివన్నీ చెబితే నేనిక్కడ వుండను-" వాకౌట్‌కు సిద్ధమయింది సీత.

"కేసు ముగియకుండా జడ్జిగారు లేవకూడదు-" అని ఒదినను హెచ్చరించాడు శేషగిరి.

"ఊ!" అంది బావగారికేసి ఇంతలు కన్నులతో సరోజ.

"ఆ అబ్బాయి- మగతగా ప్రక్కకు తిరిగి చూచేసరికి చందమామ కాస్తా దిగి వచ్చి" అని సీతవైపు చూశాడు విశ్వనాధం. ఆమె తన కాలి వేళ్ళను పదే పదే లెక్క పెట్టేసుకుంటూ వుంది.

"ఆ చందమామెవరో నేను చెప్పనా? మా ఒదినగారే!" అని ప్రకటించిన శేషగిరి నెత్తిన తాప్పుమని ఒదినచేతి మొట్టికాయ రాలింది.

సరోజ సంతోషంతో ఎగిరి గంతేసింది. విశ్వనాధం సీతకు దూరంగా జరిగి కూచున్నాడు.

"చందమామ విషయం చెప్పారు సరే. మరి ఉత్తర దిశో?" అని అడిగిన సరోజకు రహస్యంగా చెప్పాడు విశ్వం-" ఆ రోజున ఆ మంచమేమో తూర్పు పడమరలుగా వుందీ- ఆ మంచం ప్రక్కన కిటికీయేమో ఉత్తరం దిశనుందీ- ఆ కిటికీలోనుండే చందమామ దిగిందీ... వగైరా వగైరా... కనుకా ఉత్తరానే చంద్రుడుదయిస్తాడని చెప్పాను నేను-"

(తరువాయి 23వ పేజీలో)

# వెన్నెల వాన

(10 వ పేజీ తరువాయి)

సరోజ పరుగెత్తుకెళ్ళి సీత బుగ్గ గిల్లింది. ఏవమ్మా అక్కయ్యా! బావగారికోసం కిటికీలు కూడా దూకావూ?"

"ఇంకా నయ్యం! నీను మళ్లే బీచిరోడ్డు ట్రాము లైన్ల మధ్య అభిసారిక యిపోలేదు!" అన్నాడు శేషగిరి

తన తరఫున జవాబిచ్చినందుకు కృతజ్ఞత తెలిపింది సీత. "అందరికన్నా నువ్వే నయం వోయ్ మరదీ! నీలాటి వాడు, చంద్రుడు వుత్తరాన ఉదయిస్తాడన్నా ఒప్పుకోవచ్చు."

"ఒప్పుకోకపోతే పీడాపోయెగాని, ఏదినమ్మా, మధ్యన మా ఆవిడకు మొట్టికాయల అధ్యాయం నేరిపి కూర్చున్నావు కదా!"

"నేనెప్పుడు మొట్టానమ్మా మిమ్మల్ని? ఇందాక మీరే నన్ను గిల్లారుగానీ" అనలేదు సరోజ; కాని కుడిభుజం చూచుకుంది.

విశ్వనాథం అడిగాడు "ఇంతసేపట్నుంచీ నేనూ, తమ్ముడూ చంద్రుడుత్తరాన ఉదయిస్తాడంటే ఒప్పుకోలేదు కదా. పోనీ నీ అభిప్రాయం ఏమిటో చెప్పమ్మా మరదలు పిల్లా."

శేషగిరి సర్దుకుని కూర్చున్నాడు.

సరోజ చెప్పింది "చంద్రుడు దక్షిణాన ఉదయించి ఉత్తరానికి ప్రయాణంచేసి, అక్కడ అస్తమిస్తాడు; ఇది నా అభిప్రాయం కాదు; అసలు యదార్థం. నిజంగా రోజూ జరిగే నదుం!"

"భేషో, భేషో!" చప్పట్లు కొట్టాడు శేషగిరి.

సీత లేచి నిల్చుంది "ఏసుక్రీస్తు మిమ్మల్ని రక్షించుగాక! మీ ఇద్దరికీ ఏదో ఘాటయిన జబ్బు పట్టుకుంది. అంతే, తప్ప మరో కారణం ఏదీ కన్పించడం లేదు." అని తేల్చి పారేసింది.

విశ్వనాథమూ లేచాడు; "అందుచేతను, ఓ పాపులారా! మీ ఇద్దరూ కలిసి పరస్పర సహకారంతో ఏతత్ దుర్గతను పోగొట్టు కొందురుగాక! అందునిమిత్తం మీకీ రాత్రి పదింటిదాక అవకాశం ఇవ్వదలచుకున్నవారై ఆ చందమామా ఈ ఆకాశరాజూ. నినీమాకు నిష్క్రమించుచున్నారు." అంటున్న విశ్వం "నెక్ టై"ని పట్టిలాగి పరుగెత్తింది సీత.

"హత్య హత్య" అంటూ వీధివైపు వెళ్ళాడు విశ్వనాథం

సరోజా శేషగిరి మిగిలారు.

రెండు నిముషాలు మాటలు రామన్నాయి

మూడో నిముషం.

"సరోజా! చంద్రుడు ఉత్తరాన ఉదయించక పోతే ఫరవాలేదుగానీ, దక్షిణాన ఉదయిస్తాడని మాత్రం నిజంగానే నమ్ముతున్నావా?" అని అడిగాడు శేషగిరి బెంగతో.

మళ్ళీ, జలతరంగంమీద శంకరాభరణం వినిపించింది సరోజ. "అరె మీ జాగ్రఫీ! నేను చదివింది ఇంటరేననుకోండి. అయినా చందమామ ఎటునుండి వస్తాడో చూడలేనటండీ?"

"మరయితే దక్షిణం అని ఎందుకన్నావూ?"

"మీరు ఉత్తరం అన్నారు కనుక!" నింపాదిగా వచ్చింది సరోజ సమాధానం

"నేను పడమర అంటే?"

"నేను తూర్పంటానూ!"

"ఆగ్నేయమంటే?"

"ఈశాన్యమంటాను"

"నీ జాగ్రఫీ అరవ సంగీతంలా వుంది. ఆగ్నేయానికి ఎట్ట ఎదుట వున్నది ఈశాన్యం కాదు వాయవ్యం! ముందు అది తెలుసుకో! యువతీ- అది తెలుసుకో!! ఆ తర్వాత- మిగతా జాగ్రఫీ నేను చెబుతానూ- విని నేర్చుకో!"

"చెప్పండి?" అంది కిటికీలోకి ఎగిరి కూర్చున్న సరోజ; మోకాళ్ళమీద మొహం ఆనించిన సరోజ, ముద్దూ ముచ్చటా ఇచ్చేటే వున్నాయనిపించే సరోజ

శేషగిరి జాగ్రఫీ మొదలెట్టాడు.

"ఉత్తరాన తుమ్మెద రెక్కల్లాటి. బట్- కొంచెం పొట్టి జుత్తు. దక్షిణానేమో హంస రెక్కల్లాటి జపాను పాదాలు; హిమగిరి శిఖరంలాటి కంఠం ఉత్తరాన. వింధ్యలోయలాటి నడుము దక్షిణాన; కాశ్మీరంలాటి ఫాలభాగం ఉత్తరాన. కన్యాకుమారి అగ్రంలాటి. ఐస్ క్రీమ్ ముక్కలాటి ముక్కు దక్షిణాన..."

శంకరాభరణం శ్రావ్యంగా లేవగా, జాగ్రఫీ ఎగిరిపోయింది.

ఆ కిటకి ఇద్దరికి చోటు నిచ్చింది.

ఆ ఇంటా, బయటా వెన్నెల కురిసింది.

# వసంత వీచి

నీ,

ప్రశాంత సుందర దృగంతాల నవ
వసంతానిలం వీచింది.
విపంచికా మృదుల తంత్రి నా యువ
హృదంతరం పులకించింది.

చివుళ్ళెత్తినది రసాలమై హృది
కోకిలలైనవి కోరికలు
రెమ్మ రెమ్మకో పువ్వుల తురాయి
కొమ్మ కొమ్మకో సన్నాయి!

మేఘ బాలికలు బృందనర్తనము
లాడి మేను మరపించేయి!
లతల పూల దోసిళ్ళ నెత్తివ
పొంకాళ్ళ చల్లి మురిపించేయి!

పరిమళించినది పరవశించినది
జగతి నందనోద్యానమై
ప్రతి పరమాణువు పలుకరించినది
అతి సౌందర్య విధానమై

ఎన్ని భయంకర ఋతువులైన తరి
యింతుని నీ వసంతానికై
ఎట్టి కంటకాధ్వమునసైన పయ
నింతును నీ స్నేహానికై

స్నేహ ప్రపవై, విధురేఖికవై
నింపవే హృదయ మధు పాత్ర
నేదదీరి నవ జీవ కళల సా
గింప నిమ్ము ఈ చిరయాత్ర

ప్రశాంత సుందర దృగంతాల నవ
వసంతానిలం వీచింది
విపంచికా మృదుల తంత్రి నాయువ
హృదంతరం పులకించింది

కమ్మిశెట్టి వెంకటేశ్వరరావు